

ఆరోగ్యంపై కాలుష్యం కాటు..!

వాహనాల వినియోగం పెరగడంతో రోజురోజుకు కాలుష్యం అధికమవుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. - 10లో



మద్యం మత్తులో ఓ పోలీస్..!

మద్యం మత్తులో కారునడిపిన పోలీస్ ఓ వ్యక్తి మృతికి కారకుడయ్యాడు. సినీ సన్నివేశాన్ని తలపించేలా ఆధారాలు చెరిపేసేందుకు ప్రయత్నించాడు. - 10లో

ఉగ్రవాదానికి భారత్ దీటైన జవాబు

విజయనగరం: అకారణంగా ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాద చర్యలకు భారత్ దీటైన జవాబు చెప్పిందని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం సంతోషదాయకమని ఉమ్మడి విజయనగరం జెడ్పీ ౘైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారత సైన్యం 9 ఉగ్రస్థావరాలపై చేపట్టిన మెరుపు దాడులు విజయవంతం కావడంపై ఆయన బుధవారం హర్షం వ్యక్తంచేశారు. భారతీయ స్త్రీల నుదటన సింధూరం లేకుండా చేసిన ఉగ్రవాదులను అంతమొందిస్తున్న సైనికులకు సెల్యూట్ చేశారు.

న్యూస్‌రీల్

మంచం పట్టిన పనసవలస



జ్వరంతో భాదపడుతున్న హాసిని, చిన్నా, సుమిత్ర

సాలూరు: మండలంలోని పట్టుచెన్నేరు పంచాయతీ పరిధిలోని పనసవలస గ్రామం జ్వరాలతో మంచంపట్టింది. 60 కుటుంబాలు ఉన్న గ్రామంలో సుమారు 20 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారు. హాసిని, చిన్నా, సుమిత్ర, రవణమ్మ తదితరులు చలి జ్వరాలతో మంచంపట్టారు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నారు. వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి అక్కేన అజయ్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా పనసవలసలో జ్వరాల వ్యాప్తి విషయం తెలిసిందని, వైద్యశిబిరం నిర్వహించి సేవలందిస్తామని చెప్పారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



బాలాజీ

కొత్తవలస: మండలంలోని అర్దన్నపాలెం గ్రామానికి చెందిన కానూరు బాలాజీ (22) రైలు కిందపడి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఓ ప్రైవేటు బ్యాంకులో ఇంటి రుణం ఇప్పించే ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తన పెళ్లి విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. సింహాచలం వెళ్తానని మంగళవారం ఇంటినుంచి బయలుదేరాడు. బుధవారం రాత్రి 8.25 గంటల సమయంలో కంటకాపల్లి-కొత్వలస రైల్వేస్టేషన్ల మధ్య పాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై హర్షం



రాజాం నర్సింహనాయుడు కాలనీలో చిన్నారులకు మిఠాయి తినిపిస్తున్న యువతి

విజయనగరం: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఉగ్రవాదుల పీచమణిచేందుకు చేపట్టిన ఆపరేషన్ విజయవంతం కావడంపై జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం ఎదుట సంబరాలు జరుపుకున్నారు. మాజీ సైనికులు దేశ త్రివర్ణపతాకాన్ని చేతపట్టి బోలో భారత్ మాతాకి జై.. జై హింద్ అంటూ నినాదాలు చేశారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవర ఈశ్వరరావు మాట్లాడుతూ భారత సైనికులు చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చడం గర్వించదగ్గ విషయంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బారుకుల వెంకటరావు, సైనిక సంక్షేమ సంఘం ప్రధాన సలహాదారు అప్పికొండ వాసుదేవరావు నాయుడు, వంత్రం వివేకానంద, తదితర మాజీ సైనికులు పాల్గొన్నారు.

రాజాంలో సంబరాలు

రాజాం: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేసిన దాడులు విజయవంతం కావడంతో రాజాం పట్టణ పరిధి నర్సింహనాయుడుకాలనీలో యువత, చిన్నారులు భారత్‌మాతాకి జై, ఇండియన్ ఆర్మీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. టపాసులు కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు.

వైభవంగా వాసవీమాత జయంతి

విజయనగరం టౌన్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆలయ కమిటీ ౘైర్మన్ నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉమామహేశ్వరశర్మ నేతృత్వంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. అమ్మవారిని బంగారు చీర, వజ్ర కిరీటంతో అలంకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 102 రకాల పండి వంటలతో అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం పులివేషాలు, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవారి తిరువీధి జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ అమ్మవారి చరిత్రతో కూడిన 25 ఘట్టాలను ఆవిష్కరించారు.

తోటపల్లి.. ఆయకట్టుకు నీరేదీ?

తోటపల్లి ప్రాజెక్టు.. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా రైతులకు సాగునీటి ఆదరువు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి. సుమారు రెండు లక్షల ఎకరాల పైబడి ఆయకట్టు ఉంది. ఇంత ప్రాధాన్యమున్న ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోంది. గత ప్రభుత్వం తలపెట్టిన కాలువల ఆధునికీకరణ పనుల కొనసాగింపునకు అవసరమైన నిధులు విదల్చకుండా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఖరీఫ్ సమయం దగ్గరపడుతున్నా కాలువలు, షట్టర్ల పనులు చేసేవారే లేరు. వచ్చే ఖరీఫ్‌కు 64ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు.



రూపు కోల్పోయిన తోటపల్లి కాలువ

- ఖరీఫ్ సమయం దగ్గరపడుతున్నా ముందుకు సాగని కాలువల ఆధునికీకరణ పనులు
- పూడుకుపోయిన కాలువలు
- తవ్వకానికి మిగిలి ఉన్న పిల్లకాలువలు
- రైతన్నకు తప్పని సాగునీటి తిప్పలు
- నిధులు విదల్చని కూటమి ప్రభుత్వం
- ఆవేదనలో రైతాంగం

సాక్షి, పార్వతీపురం మన్యం/పాలకొండ రూరల్: నాగావళి నదిపై నిర్మించిన తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 2.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మిగులు పనులు, నిర్వహణ లేకపోవడం కారణంగా ఇంకా 64 వేల ఎకరాల వరకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా ఆయకట్టుకు నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టుకు సంబంధించి 34 డిస్ట్రిబ్యూషన్ కాలువలకు 26 పూర్తయ్యాయి. మైనర్, సబ్‌మైనర్ కాలువల పనులు 73 శాతం అయ్యాయి. మిగులు పనులకు రూ.123 కోట్ల వరకు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం గత వార్షిక బడ్జెట్‌లో కేవలం రూ.47.80 కోట్లు కేయించింది. గజపతినగరం బ్రాంచి కెనాల్ 44 శాతం పనులే అయ్యాయి. ఆ కాలువ మిగులు పనులు పూర్తి చేయాలంటే కనీసం రూ.211 కోట్లు అవసరం. ఈ నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే శివారు ఆయకట్టుకు నీరందే పరిస్థితి ఉంటుంది.



పాలకొండ మండలంలో వినియోగానికి పనికిరాని డిస్ట్రిబ్యూటరీ షట్టర్

ఆయకట్టుకు అందని సాగునీరు

పాలకొండ నియోజకవర్గంలో సాగుకు ప్రధాన నీటి వనరు తోటపల్లి రిజర్వాయర్. దీని పరిధిలో ఎడమ కాలువకు సంబంధించి 7, 8 బ్రాంచిల ద్వారా దాదాపు 10 వేలపై చిలుకు ఎకరాలకు సాగునీటి లభ్యత అందించాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ కాలువల పనులు గత ప్రభుత్వంలో యుద్ధ ప్రాతిపదికన జరిగాయి. ముఖ్యంగా వీరఘట్టం, పాలకొండ మండలాల పరిధిలోని 25 గ్రామాల్లో 8,500 ఎకరాల మేర సేద్యం చేపడుతున్న 15వేల మంది రైతులు వరుణుడి కరుణపైనే ఏటా ఆధారపడుతున్నారు. పాలకొండ మండలంలోని పాలకొండ, ఎన్‌కే రాజపురం, సింగన్నవలస, రుద్రుడుపేట, పరశురాంపురం, వెలగవాడ, లంబూరు, ఓని, వీపీ రాజుపేట, బాసూరు, అర్దలి, పద్మాపురం, వీరఘట్టం మండలంలోని నీలాపురం, తెట్టంగి, వండవ, అడారి, వీరఘట్టం, నడుకూరు.. జియ్యమ్మవలస మండలంలోని పెదబుడ్డిడి, చినబుడ్డిడి తదితర సుమారు 25 గ్రామాలకు సంబంధించి వేలాది ఎకరాల తోటపల్లి ఆయకట్టు భూములకు కొంతకాలంగా సాగునీరు అందడం లేదు. చీపురుపల్లి నియోజకవర్గంలోని ఆయకట్టుదీ ఇదే పరిస్థితి. కాలువల అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో పనులు చేయలేకపోతున్నామని అధికారులు సమాధానం ఇస్తున్నారు. వాస్తవానికి ప్రాజెక్టు కాలువల పూర్తి, నిర్వహణ, నిర్వాసితుల పునరావాసం వంటివి పూర్తి కావాలంటే సుమారు రూ.590 కోట్లు కావాలని చెబుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన రూ.47 కోట్లు ఉద్యోగులు జీతాలకే సరిపోవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు క్షేత్రస్థాయిలో సేవలందించే లష్కర్ల కొరత ఉంది. 15 మందికి ఇద్దరే సేవలందిస్తున్నారు.

చిత్తశుద్ధి లేదు..



రైతాంగ సమస్యలపై ఏ ఒక్కరికీ చిత్తశుద్ధి ఉండడం లేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మంత్రి ఉన్నారు. ఈ ప్రాంత సాగునీటి వనరులు, వాటి స్థితిగతులపై ఆయనకు అవగాహన ఉన్నా ఫలితం లేకపోయింది. తోటపల్లి కాలువల ఆధునికీకరణ ప్రహసనంగా మారింది. 7, 8 బ్రాంచిల పరిధిలో ఉన్న 32 డిస్ట్రిబ్యూటరీ షట్టర్లు పూర్తిగా రూపుకోల్పోయాయి. ఏటా వర్షంపై సాగు ఆధారపడి ఉంటోంది. ఈ బ్రాంచిల పరిధిలో క్షేత్రస్థాయిలో సేవలు అందించేందుకు 12 మంది లష్కర్లు అవసరం. కేవలం ఇద్దరితోనే నెట్టుకొస్తున్నారు.

– కండాపు ప్రసాదరావు, అభ్యుదయ రైతు, రుద్రిపేట, పాలకొండ మండలం

రోడ్డెక్కుతున్న రైతులు

ఎన్నికల సభల్లో జిల్లాలోని ప్రాజెక్టులపై హామీల వర్షం కురిపించిన కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా, ఒక్కదాన్నీ అమలు చేయలేకపోయింది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, ఆధునికీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో సాగునీటి వనుల అభివృద్ధి, శివారు భూములకు సాగునీరు అందించాలని ఎక్కడికక్కడే రైతులు రోడ్డెక్కుతున్నారు. రెండు రోజుల క్రితం పాలకొండలో అన్నదాతలు ఆయా సంఘాల మద్దతుతో భారీ ర్యాలీ చేపట్టి తమ నిరసన తెలిపారు.

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టండి

- వంగర వైఎస్సార్‌సీపీ నేత సుదర్శనరావుపై హత్యాయత్నం దురదృష్టకరం
- తెరవెనుక ఎవరున్నా సరే.. నిందితులను కఠినంగా శిక్షించాల్సిందే..
- జెడ్పీ ౘైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీకి వినతి



కరణం సుదర్శనరావుతో కలిపి ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ ౘైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్: వంగర మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కరణం సుదర్శనరావుపై హత్యాయత్నం ఘటనకు సంబంధించి లోతైన విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా జెడ్పీ ౘైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్‌వీ మాధవరెడ్డిని ఆయన బుధవారం కలిశారు. సుదర్శనరావుపై హత్యాయత్నం కేసులో దర్యాప్తు నిర్వహించి బాధ్యులను శిక్షించాలని వినతిపత్రాన్ని అందజేశారు. దాడికి తెర వెనుక ఉన్నవారిని గుర్తించి శిక్షించాలన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఇటువంటి ఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో నిరభ్యంతరంగా ప్రజల పక్షాన నిలిచేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వం నడవాలనే ఉద్దేశంతోనే ఈ ఘటనకు సంబంధించి లోతైన విచారణ జరపాలని ఎస్పీకి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, విజయనగరం ఎస్పీతో కూడా ఫోన్‌లో మాట్లాడి చర్చించినట్లు చెప్పారు. నిందితులెవరైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో కరణం సుదుర్శనరావు, అచ్చంనాయుడు, జగన్‌మోహన్‌రావు, పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ తదితరులున్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దర్యాప్తును త్వరితగతిన చేపట్టి, నిందితులెవరైనా సరే కఠినంగా శిక్షించాలి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేవిధంగా పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేయాలి. ఇప్పటికే రాజాంలోని సుదర్శన రావును కలసి పార్టీ తరఫున మేమంతా ఉన్నామని భరోసా ఇచ్చాం.

– టి.రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్

ఇచ్చిన హామీని నెరవేర్చాలి

- జీఓ3ను పునరుద్ధరించాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: అధికారంలోకి వస్తే జీఓ 3ను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు సంధ్యారాణి, నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడారు. గతంలో సాలూరు మండలం జగ్గుదొరవలసలో షెడ్యూల్ గ్రామాల ప్రకటన కోసం గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టిన సమయంలో సంధ్యారాణి, భంజ్‌దేవ్‌లు షెడ్యూల్ గ్రామాల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మేరకు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ దినోత్సవం రోజున జీఓ 3 పునరుద్ధరిస్తామని సీఎం, మంత్రి చెప్పిన విషయం గిరిజనులందరికీ గుర్తుందన్నారు. ఇటీవల జీఓ 3 రద్దుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమంటూ సంధ్యారాణి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన ఖండించారు. 2014–2019 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జీఓ 3 రద్దు కోరుతూ చేబ్రోలు లీలాప్రసాద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం సరైన న్యాయవాదులను ఏర్పాటుచేసి జీఓపై పర్యవేక్షించకపోవడంతో తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసిందన్నారు. కోవిడ్ సమయంలో ఆ తీర్పును సుప్రీంకోర్టు వెలువరించిందని, వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేసినట్టు వెల్లడించారు. ఈ నెల 8న క్యాబినెట్‌లో చర్చించి జీఓ 3ను పునరుద్ధరణకు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. మంత్రి అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

అల్లూరి పోరాటం చిరస్మరణీయం



అల్లూరి చిత్రం పటంవద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శోభిక, తదితరులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: స్వాతంత్ర్య సముపార్జనలో బ్రిటిష్‌వారితో మన్యం వీరుడు అల్లూరి పోరాటం చిరస్మరణీయమైనదని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శోభిక మాట్లాడుతూ గిరిజనుల అణచివేతను వ్యతిరేకించిన అల్లూరి.. విప్లవ జ్వాలను రగిలించిన మహా పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సీహెచ్ రాధాకృష్ణమూర్తి, పర్యవేక్షకులు శ్రీరామమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

అల్లూరి గొప్ప విప్లవకారుడు

పార్వతీపురం రూరల్: అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప విప్లవకారుడని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో అల్లూరి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఆర్‌ఐలు రాంబాబు, శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, స్పెషల్‌పార్టీ అధికారులు పాల్గొన్నారు.

చామలాపల్లిలో దారుణ హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నారాయణమూర్తి



మృతుడు తొత్తడి ప్రసాద్

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు
- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

శృంగవరపుకోట: భార్య దూరం అయ్యేందుకు కారణమైన వ్యక్తిపై పగబట్టాడు. చివరకు ఆ వ్యక్తిని హత్యచేసి పోలీసులకు లొంగిపోయిన ఘటన ఎస్.కోట మండలం చామలాపల్లిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొత్తడి ప్రసాద్(38), నడుపూరి మురళీకి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. మురళీ భార్య రెండేళ్లుగా భర్తకు దూరంగా ఇద్దరి కుమార్తెలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. ఇంటికి రావాలని ఇటీవల మురళీ పిలిచినా ఆమె రాలేదు. భార్య తన నుంచి విడిపోవడానికి ప్రసాద్ కారణమని మురళీ భావించాడు. పలుసార్లు ప్రసాద్‌ను చంపేస్తానంటూ గ్రామస్తుల వద్ద హెచ్చరికలు చేశాడు. అదును కోసం ఎదురు చూశాడు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద పెళ్లి సామాన్లు దించుతున్న ప్రసాద్‌పై కత్తితో దాడిచేశాడు. తల, మెడపై నరకడంతో ప్రసాద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య చేసిన మురళి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యకు కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పీఏసీఎస్ రుణాల్లో.. బినామీల బాగోతం!

ఓ రైతుకు రుణం వాడినట్టు తెలియదు.. ఆసలు ఆయన రుణం కోసం ఏనాడూ పీఏసీఎస్ మెట్లు ఎక్కలేదు. ఖాతా ఉన్నట్టు కూడా తెలియదు. కానీ ఆయన పేరిట రూ.లక్షపైబడి రుణం తీసుకున్నట్టు రికార్డుల్లో ఉంది. మరో రైతు చనిపోయి మూడేళ్లవుతోంది. ఆయన పేరిట రుణం వాడేశారు. ఇంకో వ్యక్తికి సెంటు భూమికూడా లేదు. ఆయన పేరిట రుణం తీసుకున్నట్టు రికార్డుల్లో ఉంది. వీరఘట్టం పీఏసీఎస్ లావాదేవీలన్నీ కంప్యూటరీకరణ కావడంతో బినామీల బాగోతం వెలుగులోకి వస్తున్నాయి.

వీరఘట్టం పీఏసీఎస్‌లో ఖాతాదారుల సంఖ్య:	3,014 మంది
వీరికి ఇచ్చిన రుణాలు:	రూ.29.25 కోట్లు
ఇంత వరకు రెన్యువల్స్ అయిన రుణాలు:	రూ.15.75 కోట్లు

- వీరఘట్టం పీఏసీఎస్‌లో చనిపోయిన వారి పేరిట వ్యవసాయరుణాలు
- భూములు లేని వారికి వ్యవసాయ రుణాలు
- కంప్యూటరీకరణతో వెలుగులోకి వస్తున్న వాస్తవాలు
- రుణాలు కట్టనివారికి నోటీసులు



వీరఘట్టం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

వీరఘట్టం:

- వీరఘట్టం పీఏసీఎస్‌లో వ్యవసాయ రుణం తీసుకున్న మాణిక్యం సాంబమూర్తి మూడేళ్ల కిందట చనిపోయారు. గతంలో ఈయన తీసుకున్న రుణం ఇప్పుడు వడ్డీతో కలిపి రూ.43,445లు తీర్చాలని పీఏసీఎస్ అధికారులు వారికి ఇటీవల నోటీసు ఇచ్చారు.
- శంకరాపు నర్సమ్మ రెండేళ్ల కిందట చనిపోయింది. ఆమె పేరిట రూ.89,247 రుణం మంజూరైనట్టు ఉంది.
- గుమ్మడి పకీరు నాయుడు ఐదేళ్ల కిందట చనిపోయారు. ఆయన పేరిట రూ.14,900 రుణ బకాయి ఉంది.
- గొర్లె వరాలమ్మ రెండేళ్ల కిందట చనిపోయింది. ఆమె పేరిట రూ.1,19,878 రుణం ఉంది. ఇలా సుమారు 300కు పైగా మృతి చెందిన వారి పేరిట రుణాలు తీసుకున్నట్టు ఆధారాలు ఉన్నాయి. మరి ఈ రుణాలు ఎవరు తీసుకున్నారు, వీటిని ఎవరు చెల్లిస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రుణాలు తీసుకున్నట్టే తెలియదట...

వీరఘట్టం పీఏసీఎస్‌లో కొప్పర అప్పలస్వామి పేరిట రూ.1,10,414 రుణం తీసుకున్నట్టు రికార్డుల్లో ఉంది. వాస్తవానికి ఆయన రుణం తీసుకోలేదని చెబుతున్నాడు. అలాగే, ఉదయాన వెంకటరావు పేరిట రూ.91,733లు, డర్రు నర్మమ్మ– రూ.17,944లు, వడంకి గోపి రూ.1,18,989లు, నల్ల రమణ రూ.90,397లు, వాన నాగభూషణరావు రూ.37,346లు, అల్లు వెంకటనాయుడు రూ.38,124లు, అల్లు లక్ష్మనాయుడు రూ.44,913లు, అలజంగి శ్రీనివాసరావు రూ.1,08,091లు, తాండ్రోతు నారంనాయుడు రూ.1,21,752లు, శంకరాపు లక్ష్మి రూ.1,23,024లు రుణం తీసుకున్నట్టు రికార్డుల్లో నమోదై ఉంది. పీఏసీఎస్‌లో తాము రుణాలు తీసుకోలేదని, తమ పేరిట ఎవరు తీసుకున్నారని ఎదురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి వందల సంఖ్యలో రైతుల పేరిట బినామీలు రుణాలు వాడినట్టు సమాచారం. రుణాలు చెల్లించాలంటూ పీఏసీఎస్ సిబ్బంది నోటీసులు ఇస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ ప్రమేయం లేకుండా రుణాలు ఎలా మంజూరు చేశారని ఎదురు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక పీఏసీఎస్‌లో పనిచేసిన వ్యక్తి హస్తం ఉన్నట్టు అనుమానిస్తున్నారు. ఆయనే బినామీల పేరిట రుణాలు తీసుకున్నట్టు సమాచారం. పీఏసీఎస్‌ల లావాదేవీలన్నీ కంప్యూటరీకరణ చేస్తుండడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.

ఇదీ పరిస్థితి....

వీరఘట్టం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 5,100 మంది రైతులు హక్కుదారులుగా ఉన్నారు. వీరిలో 3,104 మంది రైతులు సుమారు రూ.29.25 కోట్లు రుణాలు పొందినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇంత వరకు రూ.15.75 కోట్లు రుణాలు రెన్యువల్ అయ్యాయి. 1250 మంది రైతులపేరిట ఉన్న రూ.13.50 కోట్ల రుణాలు రెన్యువల్‌కావాల్సి ఉంది. రుణాలు తీసుకున్న రైతుల్లో చాలామంది చనిపోవడం, కొందరికి తమ పేరిట రుణం ఉందన్న విషయం తెలియకపోవడం సమస్యగా మారింది. రూ.13.50 కోట్లు రుణాల ఎవరి పేరిట ఉన్నాయో వారిని కట్టమని అధికారులు నోటీసులు ఇస్తున్నారు. ఈ విషయం బయటకు రానీయకుండా రైతుల పేరిట రుణాలు తీసుకున్న బినామీలు ఆపసోపాలు పడుతున్నారు. అధికారులు ఉన్నత స్థాయిలో దర్యాప్తు చేపడితే బినామీల బాగోతం బయటపడుతుందని రైతులు చెబుతున్నారు.

వడ్డీ చెల్లించాలని నోటీసులు ఇస్తున్నాం

ఏపీసీఎల్‌లో రుణాలు తీసుకుని వడ్డీలు కట్టని రైతులకు నోటీసులు ఇస్తున్నాం. నోటీసులు ఇస్తుంటే అసలు విషయం బయట పడుతోంది. ఏపీసీఎస్‌లో కంప్యూటరీకరణ కావడంతో అసలైన రైతులు ఎవరనేది స్పష్టమైంది. రుణాల వసూళ్లకు చర్యలు తీసుకుంటాం.

– జి.మధుసూదనరావు,స్పెషల్ ఆఫీసర్, పి.ఎ.సి.ఎస్,వీరఘట్టం.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో జ్యూయలరీస్ షాపు యజమాని



పోలీసుల అదుపులో ఎన్‌వీఆర్ జ్యూయలరీస్ యజమాని

విజయనగరం క్రైమ్: స్థానిక గంటస్తంభం వద్ద ఎన్‌వీఆర్ జ్యూయలరీ షాపును రన్ చేస్తున్న యజమానికి వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఆ షాపు యజమాని నాగుల కొండ వెంకట కిశోర్‌పై రెండు ఎన్‌బీబ్ల్యూ కేసులతో పాటు ఒక ఎన్‌బిఏ కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు గతంలో ఒక మహిళను వేధించాడని అప్పుడే కేసు నమోదైందన్నారు. అలాగే ఒక చెక్‌బౌన్స్ కేసులో కూడా నిందితుడని చెప్పారు. షాపుకు వచ్చిన కొనుగోలుదారులకు నకిలీ బంగారం ఆశ చూపి డబ్బులు కాజేసేవాడన్న ఫిర్యాదులు కూడా వచ్చాయని సీఐ చెప్పారు. ఈ మేరకు షాపు యజమాని కిశోర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ప్రతిభకు పురస్కారం



అనితను సత్కరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి తదితరులు

పార్వతీపురం: సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల్లో పదోతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజేయస్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో 600 మార్కులకుగాను 558 మార్కులు సాధించిన జి.అనితను సన్మానించి ఘనంగా సత్కరించారు. దీనిపై సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెర్లాం: తెర్లాం జంక్షన్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం తెర్లాం ఎస్సై సాగర్ బాబు మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియరాలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. మాసిపోయిన గడ్డం, గళ్ల లుంగీ కట్టుకుని ఉన్నాడని, సుమారు 65 నుంచి 70ఏళ్ల వయస్సు ఉంటుందని తెలియజేశారు. ఫొటోలో చూసి ఎవరైనా గుర్తుపడితే బాడంగి సీహెచ్‌సీకి వచ్చి వివరాలు తెలియజేయాలని కోరారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

కిలో గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి శ్యాంపురం రోడ్డులో కిలో గంజాయితో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని సీఐ ఉపేంద్రరావు తెలిపారు. బుధవారం శ్యాంపురం రోడ్డులోని అగ్రహారం జంక్షన్ వద్ద ఎస్సై వై.రవికిరణ్‌కు వచ్చిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వెళ్తున్న కొతారిపురం గ్రామానికి చెందిన పంచిరెడ్డి వెంకటరమణ, డోలపేటకు చెందిన పూతిక హరిశంకర్‌లను తనిఖీ చేయగా వారి స్కూటీలో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ ఉపేంద్రరావు తెలిపారు.

కుక్కకాటుతో లేగదూడ మృతి



కుక్కకాటుకు గురై మరణించిన లేగదూడ

పాలకొండ రూరల్: మండలంలోని రుద్రిపేటలో కుక్కకాటు కారణంగా లేగదూడ మరణించిందని రైతు ప్రసాదరావు బుధవారం తెలిపాడు. కొద్దిరోజుల క్రితం కుక్కకాటుకు గురైన దూడను వెలగవాడ పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లగా రేబిస్ వ్యాక్సిన్ లేదని వైద్యులు పేర్కొన్నట్లు రైతు వాపోయాడు. రూ.1200 వెచ్చించి బహిరంగ మార్కెట్‌లో వ్యాక్సిన్ కొనుగోలు చేయాల్సివచ్చిందని, అయినప్పటికీ దూడ మరణించిందన్నాడు. పశువైద్య కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచడంతో పాటు కుక్కలను నియంత్రించాలని కోరాడు.

ఆరోగ్యంపై కాలుష్యం కాటు..!

- మెదడుపై తీవ్ర ప్రభావం
- డిప్రెషన్, మతిమరుపు సమస్యలు
- పార్కిన్‌సన్స్ వచ్చే ఆస్కారం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఇలాంటి పొగతో కాలుష్యం

రాజాం సిటీ: వాహనాల వినియోగం పెరగడంతో పాటు కాలం చెల్లినవి రోడ్లపై పరుగులు తీస్తుండడంతో అధికంగా కాలుష్యం వెలువడుతోంది. నిత్యం ద్విచక్రవాహనాలపై తిరిగే వారికి వాహన కాలుష్యంతో పాటు మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా రసాయనాలు రక్తంలో కలిసి మెదడుపై ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు. ఇవి దీర్ఘకాలంలో అనేక దుష్పరిణామాలకు దారి తీస్తాయని వెల్లడిస్తున్నారు. కాలుష్యం కారణంగా సమస్యలకు గురవుతున్న వారిని తరచూ చూస్తున్నామని వైద్యులు తెలియజేస్తున్నారు.

అదుపులో ఉండని దీర్ఘకాలిక వ్యాధులు..

కాలుష్య ప్రభావానికి గురయ్యే వ్యక్తుల్లో దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉండవు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులు అదుపులో లేకపోవడంతో కీలక అవయవాలపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండెపోటు, కిడ్నీల ఫెయిల్యూర్, రక్త ప్రసరణ తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరిస్తున్నారు.

ఏం చేయాలంటే..

- ప్రజలు కాలుష్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వీలైనంత వరకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగిస్తే కాలుష్యం బారిన పడకుండా తగ్గించుకోవచ్చు.
- ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌తోపాటు సర్జికల్ మాస్క్‌లాంటిది పెట్టుకుంటే మంచిది
- కాలం చెల్లిన వాహనాల వినియోగాన్ని నివారించాలి
- ఎలక్ట్రిక్ వాహనాల వాడకంపై దృష్టి సారించాలి. అలాగే రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటితే కాలుష్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గిస్తాయి.

సమస్యలివే..

- ✔ మెదడు కుచించుకుపోయి మతిమరుపు వస్తుంది
- ✔ రక్తంలో కలిసిన రసాయనాలు మెదడులోని కీలక భాగాలపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా నరాలసమస్యతో కాళ్లు, చేతులు పనిచేయని పరిస్థితి ఎదురవుతుంది. కొందరికి పక్షవాతం కూడా రావచ్చు.
- ✔ వాసన గ్రహించలేకపోతారు.
- ✔ పార్కిన్‌సన్ (వణుకుడు రోగం) వ్యాధి రావచ్చు
- ✔ డిప్రెషన్‌కు గురవుతుంటారు
- ✔ హార్మోన్స్ సక్రమంగా రిలీజ్ కావు
- ✔ పిల్లల్లో ఎదుగుదల సమస్య తలెత్తవచ్చు
- ✔ ఫిట్స్, మైగ్రేన్స్, తలనొప్పి రావచ్చు

జన్యుపరమైన లోపాలే కాకుండా సమతుల్య ఆహార విధానలేమి, శ్రమలేని జీవన విధానాల వంటి వాటితో పాటు పర్యావరణ సంబంధిత వాహన కాలుష్యం వంటివి కూడా మధుమేహవ్యాధి సంక్రమించడానికి ముఖ్యభూమిక పోషిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి.

మెదడుపై ప్రభావం..



కాలుష్యం మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బ్రెయిన్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మెదడులో కీలక భాగాలపై కాలుష్యంలోని రసాయనాలు ప్రభావంచూపి న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తవచ్చు. కాలు చేయి పట్టు తప్పడం, బ్రెయిన్‌స్ట్రోక్, వణుకుడు రోగం వంటివి రావచ్చు. కాలుష్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పట్టణంలో తిరిగేవారు మాస్క్‌ధరించడం మంచిది.

డాక్టర్ కరణం హరిబాబు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

మధుమేహం వచ్చే ప్రమాదం..



నైట్రోజన్ డయాక్సైడ్ అధికంగా ఉన్న గాలిని పీల్చేవారు మధుమేహం బారిన పడతారు. గాలిలో 2.5 మైక్రో మీటర్లకన్నా తక్కువ పరిమాణం ఉన్న కాలుష్య పదార్థాలు ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి అక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచడమే కాకుండా ఇన్‌ఫ్లమేషన్ ప్రక్రియను ప్రేరేపించడం ద్వారా ఇన్సులిన్ నిరోధకతకు కారణమై మధుమేహానికి దారితీస్తాయి. వాహనాల శబ్దకాలుష్యంతో నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడితో హార్మోన్లు, మెటబాలిజం అసమతుల్యతతో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఫలితంగా మధుమేహం రావచ్చు.

డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

మలేరియా నిర్మూలనకు ఏసీఎం స్ప్రేచేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: మలేరియా నిర్మూలనకు ఇంటి లోపల గోడల మీద ఏసీఎం 5శాతం 9 ఆల్ఫా సైఫర్ మెత్రిన్ స్ప్రే చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. దీని కోసం జిల్లావ్యాప్తంగా 157 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో అమలు చేయనున్న మలేరియా నిర్మూలన కార్యక్రమంపై వ్యాధి ఎక్కువగా ఉన్న 18 మండలాలకు చెందిన ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, వైద్యాధికారులు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో ఆయన బుధవారం తన చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని నిరోధించడానికి మొత్తం 22 పీహెచ్‌సీల పరిధిలోని 157 గ్రామాల్లో రెండు విడతలుగా ఏసీఎం మందును పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్ల నివేదికల అధారంగా ప్రతి వెయ్యిమంది జనాభాకు రెండు లేదా అంతకన్నా ఎక్కువ మలేరియా కేసులు నమోదైన గ్రామాలను మలేరియా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి ఈ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మే 1నుంచి జూన్ 15 వరకు మొదటి విడత, జూలై ఒకటి నుంచి ఆగస్టు 15 వరకు రెండో విడత ఏసీఎం మందులను పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల గోడలపై వాలే దోమలు శక్తిని కోల్పోయి క్రమంగా నశించిపోతాయన్నారు. ఇలా మందు పిచికారీ చేసినప్పుడు ఆ ఇంటి గోడలపై 10 నుంచి 12 వారాల పాటు ఆ మందు ప్రభావం ఉంటుందని, ఆలోగా గోడలను కడగడం గాని సున్నం వేయడం గాని చేయకూడదని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ సహకారం అవసరమని కోరారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీఎంఓ వై.మణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు పారిశ్రామిక పార్కులు

- 9,10 తేదీల్లో శంకుస్థాపన

విజయనగరం రూరల్: జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా తొలివిడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ పార్కులను ఆయా నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రారంభించే కార్యక్రమానికి ఆయా నియోజకవర్గ శాసనసభ్యులతో కలిసి రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలు, ఎస్ఈ ఆర్‌ఐ వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో తొలివిడతగా ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో 127.58 ఎకరాల్లో రూ.47.35 కోట్ల వ్యయంతో పారిశ్రామిక వాడలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో ఈ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు కానున్నట్లు ఆ సంస్థ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ వెల్లడించారు. మే 9వ తేదీ ఉదయం 9 గంటలకు ఎస్.కోట నియోజకవర్గం పరిధి బలిఘట్టంలో 57.09 ఎకరాల్లో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు మంత్రి శంకుస్థాపన చేస్తారని, తొలిదశలో ఇక్కడ 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 4 గంటలకు నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో నెల్లిమర్ల ఎఫ్.ఎఫ్.సి.లో 15.55 ఎకరాల్లో రూ.15.55 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొండకిండాంలో 57.49 ఎకరాల్లో రూ.17.89 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడకు, ఉదయం 11 గంటలకు బొబ్బిలి నియోజకవర్గం పరిధి కొట్టక్కిలో 10 ఎకరాల్లో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పార్కుకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

ఉచిత మెగా డీఎస్సీ క్రాస్ కోర్సు శిక్షణ

పార్వతీపురం: జిల్లాలోని దివ్యాంగులైన అభ్యర్థులకు ఉచిత మెగా డీఎస్సీ క్రాస్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహిస్తున్నారని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడిలోపం, దృష్టిలోపం, ఆర్థోపెడిక్ తదితర దివ్యాంగులైన ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి ఈనెల 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. కనీసం 40శాతం వికలాంగత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. టెట్ స్కోర్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం మత్తులో ఓ పోలీస్..!

- కారు నడిపి ఆటోను ఢీకొట్టి..
- ఒకరి మృతికి కారణమై..
- వాహనం నంబర్ ప్లేట్ మార్చి..
- నిందితుడిని కాపాడే ప్రయత్నంలో పోలీసులు
- బాధితులకు అండగా సీపీఎం



ప్రమాదం జరిగినప్పుడు ఉన్న ఓన్ కారు నంబర్ ప్లేట్



పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన కారు టాక్సీ నంబర్ ప్లేట్

గరుగుబిల్లి/పార్వతీపురం రూరల్: గరుగుబిల్లి మండల పరిధిలోని సీతారాంపురం జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం పోలీస్‌వాహనం ముందు వెళ్తున్న ఆటోను వెనుకనుంచి ఢీకొట్టడంతో ఉల్లిభద్ర గ్రామానికి చెందిన బి.గణేష్ (42)కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అయితే ప్రమాదం జరిగిన విషయం బయటకు రాకుండా నిందితుడు తనవంతు ప్రయత్నాలు చేశాడు. సంఘటనలో తీవ్ర గాయాలపాలైన గణేష్ చికిత్సపొందుతూ మృతి చెందడంతో పోలీసులకు బుధవారం సమాచారం అందించగా స్థానిక ఎస్సై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన పోలీసు

ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన పోలీసులే నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనం నడిపి ఒకరి మృతికి కారణమయ్యారు. జియ్యమ్మవలస మండల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎ.ప్రసాద్ డ్యూటీ డ్రెస్‌లో ఉండి మద్యం తాగి కారు నడిపి ముందు వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ విషయమై చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా ప్రమాదం జరిగిన సమయంలో కానిస్టేబుల్ ప్రసాద్ మద్యం తాగి ఉన్నాడా? లేదా? అని మెడికల్ టెస్టులు, రక్త పరీక్షలు చేయించామని, తదుపరి చర్యల నిమిత్తం పార్వతీపురం ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డికి నివేదించినట్లు తెలిపారు.

నంబర్ ప్లేట్‌ను మార్చిన పోలీసులు



గణేష్ మృతదేహం

ప్రమాదం జరిగినప్పుడు కారుకు ఓన్‌బోర్డు ఉన్న నంబర్ ప్లేట్‌ను బుధవారం ఉదయానికి ట్యాక్సీ నంబర్ ప్లేట్‌గా (ఎల్లోబోర్డు) మార్చివేశారు. మార్చిన నంబర్ ప్లేటుతోనే కారును గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు ఇలా నంబర్ ప్లేట్లను మార్చి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని బాధితులకు అన్యాయం చేయడంతో పాటు చట్టాన్ని పక్కదోవ పట్టించేలా వ్యవహరించడంపై ఔరా అంటూ పలువురు ముక్కున వేలు వేసుకుంటున్నారు.

బాధితులకు అండగా సీపీఎం

మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగినప్పటికీ బుధవారం ఉదయం వరకు కేసు నమోదు చేయకపోవడంపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీవీ రమణ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదుపై ఎందుకు తాత్సారం చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని ప్రశ్నించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితుడైన కానిస్టేబుల్‌ను రక్షించేందుకు పోలీసు సిబ్బంది తమ వంతు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్ మృతి చెందడంతో తప్పనిసరి పరిస్థితిలో కేసును నమోదు చేశారు తప్ప బాధితులకు న్యాయం చేద్దామని కాదన్నారు. ప్రమాదంపై తక్షణం విచారణ నిర్వహించి కానిస్టేబుల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, మరణించిన గణేష్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నంబర్ ప్లేట్‌లు మార్చడం పట్ల, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రహదారి నిబంధనలు పోలీసులకు వర్తించవని ఈఘటనతో తెలుస్తోందన్నారు. ఈ నిరసనలో సీపీఎం నాయకులు కె. రవీంద్ర, డి.వెంకటనాయుడు, వై.మన్మథరావుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం ఉల్లిభద్ర జంక్షన్ వద్ద ప్రమాదంలో మృతిచెందిన గణేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మహిళలు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై రమేష్ నాయుడు ధర్నా స్థలానికి వచ్చి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఉల్లిభద్ర జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

9లోగా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో మూడు నెలల కాలపరిమితితో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య బుధవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున నాలుగు నియోజక వర్గాల్లో వెరసి మొత్తం 480 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదోతరగతి తప్పనిసరని, అర్హత, ఆసక్తి వున్న నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గాల వారీ శిక్షణ ఇచ్చే ప్రదేశాలు, కార్యక్రమాల వివరాలు

- పార్వతీపురం నియోజకవర్గంలోని ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇస్తారన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ 9177297528 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.
- కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, రిసెప్షనిస్ట్ కోర్సులకు సంబంధిచి శిక్షణ ఇస్తారని, మరిన్ని వివరాల కోసం ఫోన్ 63034 93720 నంబర్‌ను సంప్రదించాలన్నారు.
- పాలకొండ నియోజకవర్గంలో సీతంపేటలోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో శాంప్లింగ్ టైలర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తారని వివరాల కోసం ఫోన్ 88976 77564 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.
- సాలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఉంటుందని వివరాల కోసం ఫోన్ 73825 59022 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

దర్యాప్తు నైపుణ్యం మెరుగుపరచడమే లక్ష్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: వివిధ కేసులకు సంబంధించిన దర్యాప్తులలో నైపుణ్యాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పర్యవేక్షణలో ఫోరెన్సిక్ నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫోరెన్సిక్ నిపుణులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ వైద్యులు పాల్గొని పలు అంశాలపై వివరించి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ నేరస్థలం పరిశోధనలో దర్యాప్తు అధికారులు ఆధారాలు సేకరించాల్సిన సమయంలో అందుకు అనుగుణంగా నేరం జరిగిన చోటుకు పోలీసులు ఏవిధంగా రక్షణ కల్పించాలో, అలాగే డీఎన్ఏ, రక్త నమూనాలు, అవయవాలు, వెంట్రుకలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల విషపదార్థాలు, ఆడియో, వీడియో, ప్రధానమైన పలు నేరాలు రుజువు చేసేందుకు అవసరమయ్యే అన్ని సాక్ష్యాధారాలను భౌతికంగా ఏ విధంగా సేకరించాలి? అలాగే ప్యాకింగ్, నిల్వ భద్రపరచడం, ల్యాబ్ నుంచి వచ్చే నివేదికను వారంలోనే పొందే విధానం, కోర్టుకు తీసుకువెళ్లే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వంటి ప్రధానమైన అంశాలపై వర్క్‌షాప్ జరిగినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ వర్క్‌షాపులో పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీఐ అప్పారావు, ఫోరెన్సిక్ నిపుణులు ఎం.రాంబాబు, ఎస్.నళిని, వి.ప్రశాంతి, గోపాలకృష్ణతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ వైద్యులు అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్యులు, పోలీస్ శాఖ అధికారులు

సిద్ధంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ శోభిక, ఎస్పీ మాధవ్ రెడ్డి తదితరులు

పార్వతీపురం: జాతి భద్రత దృష్ట్యా ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సివిల్ డిఫెన్స్ అప్రమత్తతపై కలెక్టర్లు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖాధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పోలీస్ సూపరింటెండెంట్ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు. సివిల్ డిఫెన్స్ పట్ల అవగాహన కల్పించాలని, అన్ని శాఖలు ముఖ్యంగా భద్రత దళాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు.